నేడు సీతారామచంద్ర స్వామి కల్యాణం

నిజాంపేట్ : ప్రగతినగర్ నందనవనం పార్క్ నందు ఉదయం 10 గంటలకు విశ్వకల్యాణ నిమిత్తం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు శనివారం కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8:30 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, 9 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10 గంటలకు శ్రీసీతారాముల వారి కల్యాణం, 12:30 గంటలకు ఆశీర్వచనం, అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

వేడుకల ఆహ్వానం అందజేత

నిజాంపేట్: నిజాంపేట్ అభయాంజనేయ స్వామి దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి తదితరులకు శనివారం ఆహ్వానం అందజేశారు. శ్రీరామ నవమి వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేయాలని కోరారు. అదేవిధంగా బాలాజీ హిల్స్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజమోహన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నాగరాజ్‌యాదవ్, జాయింట్ సెక్రటరీ తలారి సాయి, సభ్యులు, సీనియర్ నాయకులు ఆవుల జగదీష్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తులసి అశోక్, నాయక్, బాలాజీ హిల్స్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ సురేష్ బాబు, కుమార్, సురేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం

కుత్బుల్లాపూర్: గాజులరామారం ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. నూతన అధ్యక్షుడిగా పవన్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా జగదీష్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శేఖర్ గుప్తా, వైస్ ప్రెసిడెంట్‌గా వంశీ గుప్తా, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆర్యవైశ్య సంఘానికి 200 గజాల స్థలం ఇచ్చానని, అదే విధంగా ఆలయ అభివృద్ధికి కృషి చేశానని గుర్తు చేశారు.

బీజేపీ సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా విజేందర్‌రెడ్డి

సుభాష్‌నగర్: బీజేపీ సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా విజేందర్‌రెడ్డి నియమితులయ్యారు. బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి తల్లోజు ఆచారి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసి ఆయనకు నియామక పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా విజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు.

జోరుగా నీటి దందా!

- ఇష్టానుసారంగా బోర్లు
- ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపు
- పట్టించుకోని అధికారులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు

కొందరికి అవసరం.. మరి కొందరికి వ్యాపారం.. అవసరాన్ని ఆసరాగా తీసుకుని ఇష్టమొచ్చినట్లుగా బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారు.. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. చెరువులు, వ్యవసాయ పొలాల్లో పదుల సంఖ్యలో బోర్లు వేసి 24 గంటల పాటు నీటిని తోడుతున్నారు. గండిమైసమ్మ-దుండిగల్ మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు ట్యాంకర్ల దందా జోరుగా సాగుతుంది. దీనిపై ఇప్పటి వరకు మండల రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. – దుండిగల్


బౌరంపేటలో ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తు..


నీళ్లు లేక ఎండిపోయిన సారవాని కుంట

నీటి ఎద్దడిని ఆసరా చేసుకొని..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నీటి వ్యాపారం జోరుగా సాగుతుంది. అసలే వేసవి కాలం కావడంతో ఇప్పటి నుంచే నీటి ఎద్దడి మొదలైంది. నిజాంపేట, కొంపల్లి, దుండిగల్ ప్రాంతాల్లో ఐదేళ్లలోనే వేలాదిగా అపార్ట్‌మెంట్లు, వెంచర్లు, కాలనీలు వెలిశాయి. నగర శివారు ప్రాంతం కావడంతో వేగంగా అభివృద్ధి చెందుతుంది. దీంతో ఆయా ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. దీన్ని ఆసరా చేసుకున్న కొందరు వ్యక్తులు నీటి వ్యాపారానికి తెర లేపారు.

వాల్టాకు తూట్లు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2002లో వాల్టా చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చింది. నీరు, భూమి, చెట్లను పరిరక్షించే విధంగా ఈ చట్టాన్ని రూపొందించారు. కొత్తగా ఎవరైనా బోరు వేయాలంటే తప్పనిసరిగా రెవెన్యూ మండల తహసీల్దార్ అనుమతి తీసుకోవాలి. నూతనంగా బోరు వేసే ప్రాంతంలో గతంలో 100 మీటర్ల లోపు బోరు ఉంటే అనుమతులు ఉండవు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోర్లను సీజ్ చేసి చర్యలు తీసుకునే అధికారం రెవెన్యూ అధికారులకు ఉంటుంది.

నీటిని తోడేస్తున్నారు

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో వందల సంఖ్యలో బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారు. ముఖ్యంగా బౌరంపేట, మల్లంపేటలో ఈ తంతూ జోరుగా సాగుతుంది. ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారి, కత్వ చెరువు, చెరువు కట్ట తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా బోర్లు వేశారు. చెరువుల సమీపంలో, పంట పొలాలు, పట్టా భూముల్లో బోర్లు వేసి సంపులను నిర్మించారు. ఒక్కో సంపులోకి మూడు, నాలుగు బోర్ల నుంచి నిత్యం నీటిని తోడుతున్నారు. ఆపై ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు.

రోజుకు 20 లక్షల లీటర్ల తరలింపు

నీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలను ఎంచుకున్న నీటి వ్యాపారులు ఇక్కడి నుంచి ప్రతి రోజు 20 లక్షల లీటర్ల నీటిని తరలిస్తున్నారు. నిజాంపేట, బాచుపల్లి, ప్రగతినగర్, జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, నూతన వాణిజ్య నిర్మాణాల సముదాయాలు, పరిశ్రమలకు ఈ నీటిని తరలిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

కేవలం బౌరంపేట, మల్లంపేటలోనే ఇలా పదుల సంఖ్యలో పక్క పక్కనే బోర్లు వేసి నీటి సంపులను ఏర్పాటు చేశారు. అందులో రాత్రి, పగలు అనే తేడా లేకుండా నీటిని నిల్వ చేస్తూ ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్ముకుంటున్నారు. నీటిని విక్రయించడమే కాకుండా భూగర్భ జలాలు అడుగంటుతున్నా రెవెన్యూ అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదు.

మా దృష్టికి రాలేదు

గత ఏడాది మంచి నీటి వ్యాపారంపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నాము. ట్యాంకర్లను సైతం సీజ్ చేశాము. ప్రస్తుతం జరుగుతున్న నీటి వ్యాపారం తమ దృష్టికి రాలేదని, తమ సిబ్బందిని అప్రమత్తం చేస్తాము. అనుమతులు లేకుండా నీటిని విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము.
– సయ్యద్ అబ్దుల్ మతిన్, గండిమైసమ్మ-దుండిగల్ తహసీల్దార్

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సంస్థాగత ఎన్నికల క్రమంలో బూత్, మండల, డివిజన్, మున్సిపాలిటీ, జిల్లా అధ్యక్షులను పార్టీ నియమించింది. ఈ నియామకాలను గతంలోనే అధికారికంగా ప్రకటించిన బీజేపీ ఎన్నికల అధికారులు శనివారం ఎన్నికైన అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేశారు. జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా ఎన్నికల అధికారి తల్లోజు ఆచారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పెద్దబుద్దుల సతీష్ సాగర్‌కి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు జనార్దన్ రెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా నేతలు, కొంపల్లి మున్సిపాలిటీ నాయకులు పాల్గొన్నారు.


పెద్దబుద్దుల సతీష్ సాగర్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

రంగారెడ్డినగర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్‌లో నిర్వహించిన జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. గాంధీజీ, అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, విధులను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శివ, మోటే శ్రీనివాస్‌యాదవ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జైరామ్, ఏర్వ వెంకట్, ఖాజా మియా, శామల, బండారి నారాయణ, మాధవి, చిన్నమ్మ, మల్లం శ్రీనివాస్, శంకర్ గౌడ్, తోకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ : మహనీయుల ఆశయాలను కొనసాగిద్దామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జైబాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహనీయుల చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


ఎల్‌వోసీ అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, వెంకటేష్, జీవన్‌రెడ్డి, అంజద్, ఎండీ లాయక్, అజయ్, అమీర్ అలీ పాల్గొన్నారు.

అభ్యాసాలో స్కిల్స్ మేళా

కుత్బుల్లాపూర్: గాజులరామారం అభ్యాసా స్కూల్‌లో శనివారం స్కిల్స్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. సూరారం లా అండ్ ఆర్డర్ సీఐ భరత్‌కుమార్, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన కుంభమేళా, చార్‌ధామ్, అంతరిక్ష కేంద్రం, రామమందిరం, పల్లెటూర్లు, భారతీయ రాష్ట్రాల సంస్కృతి, కాలుష్య సంబంధిత, వ్యవసాయ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సందీప్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్ నమూనాలు

సన్నబియ్యం పంపిణీ ఏ ముఖ్యమంత్రి చేయని సాహసోపేత నిర్ణయం

సుభాష్‌నగర్: పెద్దవారు తినే సన్నబియ్యం పేదలకు అందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఔదార్యాన్ని చాటుకున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి అన్నారు. శనివారం గాజులరామారంలో ఓ రేషన్ కార్డుదారుని ఇంటిలో ఇటీవల పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యంను వండించి రేషన్ కార్డుదారులతో, కార్యకర్తలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్న బియ్యం పంపిణీ చేయడం చరిత్రలో ఓ మైలురాయని తెలిపారు. కొంతమంది ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు.

రోడ్డుపై అర్ధంతరంగా నిలిచిన బస్సు

నిజాంపేట్: నిజాంపేట్ నుంచి బాచుపల్లి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు శనివారం రాజీవ్ గాంధీ నగర్ వద్దకు రాగానే ఎక్సెల్ ఊడిపోవడంతో రోడ్డుపైనే ఒరిగింది. దీంతో ట్రాఫిక్ జాం అయ్యింది. ట్రాఫిక్ పోలీసులు సకాలంలో స్పందించి క్రేన్ సాయంతో బస్సును పక్కకు తొలగించారు. అనంతరం ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు.

నామ మాత్రపు ఫీజుతో స్కేటింగ్‌లో శిక్షణ

కుత్బుల్లాపూర్: కృష్ణ బూమ్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్కేటింగ్ శిక్షణ శిబిరం శనివారం ప్రారంభించారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా ప్రారంభమైన ఈ స్కేటింగ్ శిబిరంలో నామమాత్రపు ఫీజుతో శిక్షణ ఇవ్వనున్నట్లు కోచ్ కృష్ణ తెలిపారు. మూడు సంవత్సరాలుగా శిక్షణ ఇవ్వడమే కాకుండా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే స్కేటింగ్ పోటీలకు వీరిని తయారు చేసే విధంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. గాజులరామారం అకాడమీ సమీపంలో ప్రతిరోజు సాయంత్రం 4:30 నుంచి 7 గంటల వరకు, అదేవిధంగా ఎస్వీఆర్ స్కూల్ సమీపంలో సాయంత్రం 4:30 నుంచి 6:30 వరకు ఈ శిక్షణ శిబిరాలు ప్రారంభం చేసినట్లు తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

కుత్బుల్లాపూర్: ప్రేమ విఫలమవ్వడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కట్యూరు మండలం కరుకుర్తి గ్రామానికి చెందిన మహేశ్వరం నాగరాజు (25) కుత్బుల్లాపూర్ బ్యాంక్ కాలనీలో తన స్నేహితులతో కలిసి నివాసముంటున్నాడు. క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన సొంత గ్రామానికి చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. నాగరాజు సదరు యువతితో తరచూ ఫోన్ చాటింగ్ చేసేవాడు. శుక్రవారం యువతి ప్రేమను నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి స్నేహితుడు జితేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ..

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం బేతాల్‌పూర్‌కు చెందిన ఇంద్ర ధూమ్యా (26) రెండు సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చాడు. సుభాష్‌నగర్‌లో నివాసముంటూ ప్లంబింగ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల పనులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. శుక్రవారం సాయంత్రం శేరిలింగంపల్లిలో ఉంటున్న తన అన్న అభినవ్‌కు ఫోన్ చేసి 'ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి.. చనిపోతున్నాను' అని చెప్పి ఫోన్ కట్ చేశాడు. అనంతరం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి యజమాని శనివారం ఉదయం తలుపులు కొట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు పగలగొట్టాడు. ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తి చెంది..


నూకయ్యశెట్టి(ఫైల్)

కుత్బుల్లాపూర్: జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు చెదల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా నక్కపల్లి గ్రామానికి చెందిన కొత్త నూకయ్యశెట్టి(62) కుటుంబం మూడు సంవత్సరాల క్రితం వలస వచ్చి కుత్బుల్లాపూర్ గణేష్ హౌసింగ్ సొసైటీలో నివాసముంటున్నాడు. నూకయ్యశెట్టి గతంలో కిరాణా దుకాణం నడిపాడు. జీవితంపై విరక్తి చెందిన అతను శుక్రవారం సాయంత్రం చెదల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. అతడిని కుటుంబ సభ్యులు సమీపంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి అల్లుడు అనిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షటిల్ కాక్ తీస్తుండగా విద్యుదాఘాతంతో మృతి


శేషు(ఫైల్)

కుత్బుల్లాపూర్: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సుచిత్ర వెన్నెలగడ్డకు చెందిన శేషు(36), శాంతి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. శేషు మూసాపేట్‌లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం శేషు తన పిల్లలతో కలిసి షటిల్ ఆడుతుండగా కాక్ విద్యుత్ తీగలపై పడింది. ఈ క్రమంలో కాక్‌ను తీసేందుకు యత్నించగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబుల హల్‌చల్

జగద్గిరిగుట్ట: వేంకటేశ్వర నగర్‌లో శుక్రవారం అర్ధరాత్రి వరకు తప్పతాగి మందుబాబులు హల్‌చల్ చేశారు. ఇళ్ల ముందు తాగుతూ అరవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురరయ్యారు. పక్కకు వెళ్లి తాగమని చెప్పిన వారిపై బూతులు తిడుతూ దాడి చేసేందుకు యత్నించారు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిని స్టేషన్‌కు తరలించారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

జయంతి వేడుకలో వక్తలు

పూలమాలేసి నివాళులర్పించిన నాయకులు

కుత్బుల్లాపూర్: స్వాతంత్ర్య సమరయోధుడు, కేంద్ర మాజీ మంత్రి బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని వివిధ పార్టీలు, దళిత సంఘాల నాయకులు అన్నారు. ఆయన జయంతి వేడుకలను శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సామాజిక హక్కుల కోసం పోరాడిన మహానేత అని అన్నారు.


చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు, కాలనీ వాసులు


గాంధీనగర్‌లో నివాళులర్పిస్తున్న రాఘవులు తదితరులు


సూరారంలో .. మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, దళిత సంఘాల నేతలు


సూరారంలో .. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్


దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కమిషనర్


జగద్గిరిగుట్ట బుద్ధ విహార్ వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు